ప్రజాశక్తి

శనివారం 14 డిసెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

చలికాలంలో బిల్లుల మోత

◆ చిరు వ్యాపారులపై విద్యుత్ ఛార్జీల పిడుగు ◆ ఎఫ్‌పిపిసిఎ పేరిట భారం

ప్రజాశక్తి - భీమునిపట్నం

ఈసారి చలికాలంలోనూ విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్టమెంట్ (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో భారం మోపడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలతో పాటు చిరు వ్యాపారులూ విలవిల్లాడుతున్నారు. పాన్‌షాపులు, చిన్నపాటి కిరాణా షాపులు, జిరాక్స్, ఫ్యాన్సీ తదితర దుకాణాల నిర్వాహకులు పెరిగిన విద్యుత్ ఛార్జీలతో ఆందోళనకు గురవుతున్నారు. 'శీతాకాలంలో సహజంగానే విద్యుత్ వినియోగం తక్కువ ఉంటుంది. బిల్లులు తక్కువ వస్తాయి. కానీ ఈసారి అలా జరగలేదు. నవంబర్ నుంచే విద్యుత్ ఛార్జీల మోత మోగుతోంది. ఇక విద్యుత్ వాడకం ఎక్కువగా ఉండే వేసవిలో ఏ మోతాదులో ఈ మోత ఉంటుందో'నని చిరువ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ట్రూఅప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరిట ప్రభుత్వం వేస్తున్న అదనపు విద్యుత్ భారాలపై నేడు సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి జనంపై భారం మోపింది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదని కూటమి పాలకులు ఎన్నికల సమయంలో మిగతా 2లో..

పెరిగిన బిల్లును చూపుతున్న మోహనరావు

బాబోయ్..

అక్టోబర్‌లో రూ.1770, నవంబర్‌లో రూ.3180 బిల్లు వచ్చింది. ఒక్కసారిగా ఇంత పెద్ద మొత్తంలో పెరగడం ఆందోళన పరుస్తోంది. వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న ఛార్జీలను నిలుపుదల చేయాలి.

- రాజా, పాన్‌షాప్ నిర్వాహకులు, తగరపువలస

ఛార్జీల పెంపుతో విపరీత భారం

జిరాక్స్ షాప్ నడుపుతున్నాను. రోజుకు రూ.500 రావడం కష్టంగా ఉంది. ఒక ఫ్యాన్, జిరాక్స్ మిషన్ మాత్రమే వాడుతున్నాం. ఇప్పుడు శీతాకాలం కావడంతో ఫ్యాన్ వాడకం సహజంగానే తక్కువైంది. అయితే కరెంట్ బిల్లు మాత్రం పెరిగింది. ఈ నెలలో వచ్చిన బిల్లుపై రూ.772 చెల్లించాలని ఉంది. గత నెలలో రూ.569 బిల్లు రాగా ఇప్పుడు విద్యుత్ వినియోగం తగ్గినా బిల్లు మొత్తం పెరిగింది. ట్రూఅప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరిట ఎక్కువ మొత్తాన్ని లాగేసుకోవడం గమనించాను.

- ఎన్.మోహనరావు, జిరాక్స్ దుకాణం యజమాని, భీమిలి

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

◆ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

◆ తొమ్మిదేళ్ల తరువాత ఎన్నికలు జరుగుతుండటంతో సర్వత్రా ఆసక్తి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2015 తరువాత జరుగుతున్న ఈ ఎన్నికలపై ఆయకట్టుదారుల్లో ఆసక్తి నెలకొంది. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. పోటీచేసే అభ్యర్థి ఎంపికలోనూ ఆచితూచి నిర్ణయం తీసుకున్నాయి. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభంకానుంది. సాయంత్రం ఐదు గంటలకు ఎన్నికలు ముగుస్తాయని అధికారులు భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో తమ పట్టునిలుపుకోవడానికి వైసిపి, టిడిపి కూటమి నీటి సంఘాల ఎన్నికలను ప్రతిష్ఠంగానే తీసుకున్నాయి. జిల్లాలోని తాండవ, కోనాం, రైవాడ, పెద్దేరు ప్రాజెక్టుల పరిధిలో ఓటర్లుగా నమోదైన ఆయకట్టుదారులు ప్రాదేశిక సభ్యులను ఎన్నుకోనున్నారు. ఈ సభ్యులు నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులను ఎన్నుకుంటారు. తాండవ పరిధిలో 16 నీటి వినియోగదారుల సంఘాలు, రైవాడ ప్రాజెక్టు కింద 10 నీటి వినియోగదారుల సంఘాలు, 120 ప్రాదేశిక సభ్యులు, కోనాం పరిధిలో ఎనిమిది నీటివినియోగదారుల సంఘాలు, 96 ప్రాదేశిక సభ్యులు, పెద్దేరు కింద 10 నీటి వినియోగారుల సంఘాలు, 116 ప్రాదేశిక సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి.

తాండవ, కోనాం, రైవాడ, పెద్దేరు ప్రాజెక్టుల కింద 2,75,246 మంది ఆయకట్టుదారులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. తాండవ కింద ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్నాయి. వీటి తరువాత తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు ప్రాజెక్టుల్లో ఒక ప్రాజెక్టు కమిటీ చొప్పున నాలుగు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే ప్రాజెక్టు కమిటీల తేదీని ప్రకటించాల్సివుంది. భవిష్యత్తులో ప్రాజెక్టు, కాలువల మరమ్మతులు, నిర్వహణ, పూడికతీత వంటి పనులను ఎన్నికైన కమిటీలు చేపట్టనున్నాయి.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

▶ వార్త 5లో..

నూతన ప్రక్రియలతో లాభసాటి వ్యవసాయం

▶ వార్త 5లో..

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

▶ వార్త 4లో..

బంగారమ్మపాలెంలో బిల్లులు దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు, మహిళలు

విద్యుత్ భారాలపై నిరసనలు

పలుచోట్ల బిల్లులు దగ్ధం

వార్తలు 8లో..

విఎంఆర్‌డిఎ ప్రాజెక్టులతో విశాఖ అభివృద్ధి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ అభివృద్ధిపై దృష్టి పెట్టారని, ఆయన నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో ప్రాజెక్టులు ఉండాలని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్‌లో ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా విశాఖ అభివృద్ధి కోసం పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుని, పర్యాటకులను ఆకర్షించే ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానం చేసేలా రహదారుల నిర్మాణంపై దృష్టి పెట్టాలని, ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టులను గుత్తేదారులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. అదే సమయంలో పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని సూచించారు. త్వరలో అన్ని ప్రాజెక్టులను క్షేత్ర స్థాయిలో పర్యటించి, పరిశీలన చేస్తానని చెప్పారు. ప్లానింగ్ విభాగానికి వచ్చే మిగతా 2లో..

విశాఖలో నిర్వహించిన నిరసన ర్యాలీలో అమర్‌నాథ్, తదితరులు

రైతు సమస్యలపై వైసిపి నిరసనలు

జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు

వార్తలు 6లో..

మొదటి పేజీ తరువాయి..

చలికాలంలో బిల్లుల మోత

ఊదరగొట్టారు. గెలిచాక ఆ హామీని విస్మరించి బిల్లుల మోత మోగిస్తున్నారు.

గత నెల కంటే రూ.311 పెరిగింది

నేను టాటూ దుకాణదారుడిని. అక్టోబర్ నెలలో రూ.439 బిల్లు వచ్చింది. నవంబర్ బిల్లు రూ.750 బిల్లు వచ్చింది. గతం కంటే 311 పెరిగింది. నెలకు నా దుకాణం అద్దె రూ.4 వేలు. నెలంతా పచ్చబొట్లు వేస్తే వచ్చేది రూ.20 వేలు. అందులో అద్దెలు, ఇలా విద్యుత్ ఛార్జీలకు పోతే మిగిలేది తక్కువే. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి.

- కె.దివాకర్, టాటూ దుకాణం నిర్వాహకుడు, భీమిలి

చలికాలంలోనే ఇలా ఉంటే..

తాజాగా బిల్లు రూ.737 వచ్చింది. అందులో ఎఫ్‌పిపిసిఎ 1 పేరుతో రూ.49.95, ఎఫ్‌పిపిసిఎ 2 పేరుతో రూ.10 అదనంగా వేశారు. గత నెలలో రూ.582 బిల్లు రాగా ఈసారి పెరిగింది. చలికాలంలో కరెంట్ వాడకం తక్కువ. ఇప్పుడే ఇంత మొత్తంలో బిల్లు వస్తే, వేసవిలో ఇంకెంత బిల్లు వస్తుందోనని ఆందోళనగా ఉంది.

- కె.సంతోష్,
కిరాణా దుకాణం యజమాని, తగరపువలస

మాట్లాడుతున్న ప్రణవ్ గోపాల్

విఎంఆర్‌డిఎ ప్రాజెక్టులతో విశాఖ అభివృద్ధి

లేఅవుట్లు, బిల్డింగ్ పర్మిషన్లు, చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ దరఖాస్తుల పరిశీలనలో ఆలస్యం వహించవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టబోయే సింగిల్ విండో విధానంపై దరఖాస్తుదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ రెండు విభాగాలకు చెందిన పలు అంశాలపై సమీక్ష చేశారు. ఈ సమీక్షలో చీఫ్ అర్బన్ ప్లానర్ వి.శిల్ప, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు పాల్గొన్నారు.

సమగ్ర బీమాతో ఆర్థిక భద్రత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలకు సమగ్ర జీవిత బీమాతో ఆర్థిక భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా విశాఖ నగరంలో కార్యకలాపాలు విస్తతం చేయనున్నామని ఇండియా ఫస్ట్ లైఫ్ మేనేజింగ్ సిఇఒ రుషబ్ గాంధీ శుక్రవారం మీడియాకు తెలిపారు. అందులో భాగంగా విశాఖపట్నం బ్రాంచిలో సలహాదారులను నియమించనున్నట్లు తెలిపారు. ఏజెన్సీ నిర్మాణ్ పేరుతో దేశవ్యాప్తంగా 18 కొత్త బ్రాంచిలను ప్రారంభించామని, వీటిని మూడు నెలల వ్యవధిలో ఏర్పాటు చేశామని అన్నారు. ఇండియా ఫస్ట్ లైఫ్ ఏజెన్సీ ఛానెల్ ప్రెసిడెంట్ సుమీత్ సాహ్ని మాట్లాడుతూ పాన్ ఇండియా విస్తరణ ద్వారా శక్తివంతమైన ఏజెన్సీ ఛానెల్‌ను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించామన్నారు.

తప్పుడు ఫిర్యాదుదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిసి సామాజిక తరగతికి చెందిన దంపతులు ఎస్‌సి రెల్లి సామాజిక తరగతికి చెందిన తమను తప్పుడు కులం పేరుతో వేధింపులకు గురి చేస్తూ, పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని గోపాలపట్నం సమీపంలోని ప్రహ్లాదపురానికి చెందిన దేవులపల్లి కల్పన, ఆమె భర్త నాగేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తాము నివసిస్తున్న ఇంటికి ఎదురుగా నివసిస్తున్న తోట లీలావతి, తోట పరమేశ్వర సూర్య చంద్రరావులు 2007లో అనవసరంగా గొడవ సృష్టించి, దౌర్జన్యం చేశారని, తిరిగి తమపైనే వారు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఆ ఫిర్యాదులో వారు ఎస్‌టి సామాజిక తరగతికి చెందినట్లుగా పేర్కొన్నారని, దీంతో పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం తమపై కేసు నమోదు చేశారని తెలిపారు. నిజానికి వారు ఎస్‌టి సామాజిక తరగతికి చెందిన వారు కాదని, బిసి తరగతికి చెందిన వారని తెలిపారు. ఈ ఏడాది జూన్ 2న మరోసారి వారు తమపై దౌర్జన్యానికి పాల్పడి, తిరిగి తమపైనే కేసు పెట్టారని తెలిపారు. ఈసారి వారు ఇచ్చిన ఫిర్యాదులో బిసి సామాజిక తరగతికి చెందిన కాళింగ అంటూ పేర్కొన్నారని చెప్పారు. ఇప్పటికైనా పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - సీతమ్మధార : ప్రజల ఓట్లతో ఎన్నికైన వారు కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారని, ఇప్పటికైనా తీరు మార్చుకుని వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు కృషి చేయాలని బిఎస్‌పి రాష్ట్ర చీఫ్ కో-ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసిన సందర్భంగా శుక్రవారం పౌర గ్రంథాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటింపజేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే ఉద్యోగులకు, నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. 1400 రోజుల నుంచి ఉక్కు పరిరక్షణ పోరాటం జరుగుతుంటే ఇక్కడ ఓట్లతో గెలిచిన ఎంపీలు పార్లమెంట్‌లో మాట్లాడకపోవడం దారుణమన్నారు. సోలార్ విద్యుత్ కుంభకోణంలో రూ.1750 కోట్లు లంచం ముట్టిందని అమెరికా కోర్టు చెప్పినప్పటికీ విచారణ జరిపి కేసు నమోదు చేయకపోవడం వెనుక అదానీతో చంద్రబాబుకు ఉన్న అనుబంధమే కారణమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన జెఎసికి ఛైర్మన్‌గా వివి.రమణమూర్తి, కన్వీనర్‌గా లకే రాజారావు వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల ఐక్య సంఘం ప్రధాన కార్యదర్శి ఉమ్మడి అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలి

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో ఏకైక పెద్ద పరిశ్రమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తూ పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని సిఐటియు కంచరపాలెం జోన్ ప్రధాన కార్యదర్శి ఒ.అప్పారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1355వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. సొంత గనులు కేటాయించాలన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తానని ప్రకటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే విశాఖ ఏ విధంగా ఆర్థిక రాజధానిగా మారుతుందో చెప్పాలన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ మూతపడితే విశాఖపట్నం నగర భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. సంఘం నాయకులు జి.అప్పలరాజు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడతామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగులకు జీతాలు, ఇతర సౌకర్యాలు కూడా ఇవ్వకుండా చేస్తున్న యాజమాన్యం, ప్రభుత్వ విధానాలను ఆయన నిలదీశారు. దీక్షల్లో ఎం.ఈశ్వరరావు, ఎస్.రామగోపాల్, భానుమూర్తి, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, గిరి, పిట్టోడు, విఎస్ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసి ఏజెంట్ల సంక్షేమం కోసం ఉద్యమం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జీవిత బీమా సంస్థలో పనిచేస్తున్న ఏజెంట్ల సంక్షేమం కోసం ఉద్యమిస్తామని ఆల్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) ఛైర్మన్ ఎన్.గజపతిరావు అన్నారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం లియాఫీ సౌత్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విశాఖ ఎల్‌ఐసి బిల్డింగ్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత జీవిత బీమా సంస్థ యాజమాన్యంపై ఉందన్నారు. ఏజెంట్లకు పాత పద్ధతిలోనే కమీషన్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాలసీదారులకు బోనస్ పెంచాలని, జిఎస్‌టి రద్దు చేయాలని, పాలసీల్లో ప్రాథమిక వయసును, ఏజెంట్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ వయసును పెంచాలని కోరారు. కనీస బీమాను రూ.లక్షగా ఏర్పాటు చేయాలని, ఏజెంట్లు అందరికీ మెడిక్లెయిమ్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. లియాఫీ సౌత్ సెంట్రల్ డివిజనల్ అధ్యక్షులు బి.తిరుమలరావు మాట్లాడుతూ 68 ఏళ్లుగా ఉన్న ఎల్‌ఐసి పద్ధతుల్లో మార్పులు తీసుకువచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పాలసీపై జిఎస్‌టి పెంపు, మెచ్యూరిటీ బోనస్ తగ్గించడం, ఎంట్రీ వయసు 50 ఏళ్లకు తగ్గించడం, ప్రీమియం రేట్లు పెంచడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణం నూతన విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ధర్నాలో జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.శివకుమార్, డివిజనల్ సెక్రటరీ ఎన్‌విఆర్.వెంకటేశ్వరరావు, డివిజనల్ ట్రెజరర్ వివిఎస్.కామేష్, జోనల్ ఇసి మెంబర్ బివి.రమణ, లియాఫీ ఇసి మెంబర్స్ కెవి.రమణ, సివి.రవికుమార్ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న నాయకులు

పాత ఇన్సెంటివ్స్‌పై స్పందించాలి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : పాత ఇన్సెంటివ్‌లను క్లియర్ చేసే విధానం కొత్త ఐటి పాలసీలో ఉండేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపి డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీస్ లీడర్ షిప్ ఫోరం కన్వీనర్ శ్రీధర్ కొసరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పాత ఇన్సెంటివ్స్ పెండింగ్ సుమారు రూ.70 కోట్ల వరకూ ఉంటుందని, అయితే, రూ.20 కోట్ల మేర సిఎఫ్ఎంఎస్‌లో డబ్బులు అప్‌లోడ్ అయి ఉన్నాయని, వీటిని తొలుత క్లియర్ చేయాలని కోరారు. పాత ఐటి రంగంలో కంపెనీలకు, ఉద్యోగులకు వారి కుటుంబాలను కవర్ చేస్తూ ఇన్సెంటివ్‌లు ఇవ్వడంతో ఐటి రంగానికి కొత్త ఊపు రానుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కొత్త పాలసీ ఇలా..

కూటమి ప్రభుత్వం నూతన ఐటి పాలసీని ప్రవేశపెడుతూ జిఒ ఎంఎస్ నెంబరు 9ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఐటి స్పేస్‌లు ఏర్పాటు చేసినా ఇన్సెంటివ్స్, ఐటి ఉద్యోగులకు సైతం ఇన్సెంటివ్స్‌లను ఈ విధానంలో ప్రకటించడం విశేషం. ఐటి కంపెనీలు ఏవైనా పార్కులను ఏర్పాటు చేస్తే ఒక రకమైన ఇన్సెంటివ్ ఇవ్వనున్నారు.

ఐటి ఉద్యోగుల పిల్లలు చదువు కోసం లేదా ఇంటి అద్దె అలవెన్స్ కింద రూ.లక్షలు నూతన పాలసీలో వర్తిస్తుంది. 3 సంవత్సరాల వరకూ వీటిని ప్రభుత్వం ఇవ్వనుంది.

పోర్టు అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గుండపు ఉమామహేశ్వరరావు, బి.నాగేశ్వర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికారుల సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘంలోని ఇతర పదవులకు సభ్యులను ఎన్నుకున్నారు. కోశాధికారిగా అల్లం చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. కార్యవర్గానికి పోర్టు యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపింది.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో ఈ నెల 14 నుండి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ పొదుపు పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పర్యవేక్షక ఇంజినీరు జి.శ్యాంబాబు విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు, జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రంలో ఈ నెల 20న నిర్వహిస్తున్నామన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి
(సీనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టులో
HMOP 44/2024

రాయుడు శ్రీనివాసరావు ...పిటీషనర్
మరియు
రాయుడు మంజుల W/o వెంకటేశ్వరరావు , వయస్సు 53, ఫ్లాట్ నెంబర్: 106 D.No 11-165/5, పవన్ కుమార్ రెసిడెన్సి-2, T.V . టవర్ కాలనీ సింహాచలం విశాఖపట్నం 530028 ...రెస్పాండెంట్

పై నెంబరు పిటీషన్ లో రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు ద్వారా నోటీసులు ఎన్నిసార్లు పంపించినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన చేయడమైనది. ఈ పిటీషన్ వాయిదా ది. **19-12 -2024** తేదీన ఉన్నది. కావున ఆరోజు మీరు స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని ఉదయం **10:30** గంటలకు కోర్టులో హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
కాండ్రేగుల వర ప్రసాద్,
అడ్వకేటు,అమలాపురం
సెల్: 9393003681

అమలాపురం
12-12-2024

సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : పెందుర్తిలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించే సిపిఎం విశాఖ జిల్లా మహాసభల నేపథ్యంలో 28న పెందుర్తిలో జరిగే భారీ ప్రదర్శన, సభలలో ప్రజలు, కార్మికులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు కోరారు. మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం సిపిఎం ఆరిలోవ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా మహ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో కార్మికులు, ప్రజా సమస్యలపై నిరాటకంగా సిపిఎం పోరాడుతుందన్నారు. ఆరిలోవ ప్రాంతంలో ముడసర్లోవ భూముల కుంభకోణాన్ని నిరసిస్తూ నగర వ్యాప్తంగా సిపిఎం ఆందోళన, పోరాటం చేపట్టిందన్నారు. ప్రజలపై ప్రభుత్వాలు వేసిన చెత్త, ఆస్తి పన్నులు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాడి అనేక విజయాలు సాధించిందన్నారు. విశాఖ ఉక్కు, ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడటం కోసం ఉద్యమించిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు తిరగకముందే కరెంటు ఛార్జీల భారం రూ.17 వేల కోట్లు వేసిందని తెలిపారు. అదాని వద్ద గత ప్రభుత్వం రూ.1750 కోట్లు ముడుపులు తీసుకొని సౌరవిద్యుత్ ఒప్పందం చేసుకొని ప్రజలపై భారాలకు సిద్ధపడిందని విమర్శించారు. దానిని రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం అమలుకు పూనుకుందన్నారు. సిపిఎం జిల్లా మహాసభలో ప్రభుత్వ విధానాలపై భవిష్యత్తులో ఉద్యమించేందుకు నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వి.నరేంద్రకుమార్, జోన్ కమిటీ సభ్యులు పి.శంకర్, డి.నాగరాజు, చింతల నాయుడు, కాంత తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణారావు తదితరులు

నేరాలు ఘోరాలు

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : పగటిపూట దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని గాజువాక క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన నుంచి రూ.6,52,600 విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గాజువాక పోలీస్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో క్రైమ్ డిసిపి కె.లతామాధురి వివరాలను వెల్లడించారు. కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన ఎం.జగదీష్ గాజువాకలో నాలుగు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. పగటిపూట తాళాలు వేసిన ఇళ్లను చూసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. భార్యాభర్తలిద్దరూ డ్యూటీలకు వెళ్లే ప్రాంతాలను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గాజువాకలో నాలుగు చోరీలకు పాల్పడినట్లు చెప్పారు. ఈయనపై కృష్ణా జిల్లాలో 14 కేసులు నమోదైనట్లు తెలిపారు. గుడివాడ పోలీస్ స్టేషన్లో సస్పెక్ట్ కేసు కూడా నమోదైనట్లు వివరించారు. చోరీ సొత్తును కొన్న తణుకుకు చెందిన జ్యోతి శివశ్రీని కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఏడాది క్రితం ప్రమాదవశాత్తు మరణించి, అవయవాలను దానం చేసి కొంతమందికి జీవితాన్ని ప్రసాదించిన బొండా సంతోష్‌కుమార్ జ్ఞాపకార్థం ఆరిలోవ హెల్త్‌సిటీ మైదానంలో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఎసి మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి రామన్ ప్రారంభించారు. ముందుగా ఆమె సంతోష్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మరణించి మరి కొంత మందికి జీవితాన్ని ప్రసాదించిన సంతోష్ పేరుమీద క్రికెట్ టోర్నీ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బోని శ్రీను, బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు నిధులు మంజూరు

ప్రజాశక్తి -భీమునిపట్నం : శిథిలావస్థకు చేరిన సాంఘిక సంక్షేమ వసతి గృహ భవనాల మరమ్మతు పనులకు ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేసింది. భీమిలి నియోజకవర్గంలో ఉన్న 9 వసతి గృహ భవనాల మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.కోటీ 18 లక్షలు మంజూరు చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు తెలిపారు. జివిఎంసి మూడో వార్డు డైట్ వద్ద ఉన్న కళాశాల బాలుర వసతి గృహ భవనం మరమ్మతు పనులకు రూ.10.15 లక్షలు, కృష్ణా కాలనీ బాలుర వసతి గృహానికి రూ 5.52 లక్షలు, కళాశాల బాలికల వసతి గృహానికి రూ.23.03 లక్షలు, తగరపువలస, బంగ్లా మెట్ట కళాశాల బాలుర వసతి గృహానికి రూ.8.09 లక్షలు, కొండపేట, బాలికల వసతి గృహానికి రూ.8.80 లక్షలు, పరదేశి పాలెం కళాశాల బాలికల వసతి గృహానికి రూ.8.65 లక్షలు, ఆనందపురం బాలికల వసతి గృహానికి రూ.12.35 లక్షలు, మధురవాడ బాలుర వసతి గృహానికి రూ.19.22 లక్షలు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి- ఆనందపురం : పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆనందపురం ఉన్నత పాఠశాలను డిఇఒ శుక్రవారం సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన 100 రోజులు ప్రణాళికను అమలు చేసి శత శాతం ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గంగరాజు, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పట్నాయక్, బి.గౌరీశంకర్, ఎస్.శివాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత పూర్వ వైభవానికి చర్యలు

మేళా ప్రారంభంలో గంటా

ప్రజాశక్తి -మధురవాడ : చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. 'నా చేనేత - నా ఆత్మ గౌరవం' పేరుతో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యాన మధురవాడ శిల్పారామంలో ఏర్పాటుచేసిన చేనేత మేళాను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక చేనేత కుటుంబమంతా కనీసం రెండు వారాలు కష్టపడితేనే ఒక చీర తయారవుతుందని చెప్పారు. అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారు చేసిన ఖ్యాతి తెలుగు రాష్ట్రాల నేత కళాకారులదని, వారానికి ఒకసారి చేనేత, ఖాదీ వస్త్రాలను ధరించి ఆ రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. చేనేత వస్త్రాలకు తమ కళా నైపుణ్యంతో వన్నె తెస్తున్న వారిని కార్మికులుగా కాకుండా కళాకారులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో యూనిఫారాల సరఫరా ఆప్కోకు ఇవ్వడం ద్వారా అనేకమంది నేతన్నలకు ఉపాధి కలుగుతుందన్నారు. విద్యుత్తు, రుణ రాయితీలతో మధ్యవర్తులు లేకుండా ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఉత్పత్తులకు మంచి ధర వచ్చేట్లు చేస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల పాల్గొంటున్న చేనేత, హస్త కళల కళాకారుల కోసం 14 రోజుల పాటు మేళాలో 64 స్టాల్స్ ఏర్పాటుచేసి, టిఎ, డిఎలు కూడా ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. టూరిజం మంత్రి కందుల దుర్గేష్‌తో చర్చించి శిల్పారామాన్ని పిపిపి. మోడల్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు దాసరి శ్రీనివాస్, శాఖారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌ను పూర్తిస్థాయి ప్రభుత్వ ఆసుపత్రి చెయ్యాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రిని పూర్తిస్థాయి ప్రభుత్వ ఆసుపత్రిగా చెయ్యాని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి కోరారు. పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం సూపరింటెండెంట్ సత్యనారాయణను ఆమె కలిశారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యం, కెజిహెచ్‌పై ఒత్తిడి తగ్గుతుందనే భావనతో కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హనుమంతవాక జంక్షన్‌లో 100 ఎకరాల విలువైన స్థలాన్ని విమ్స్ ఆసుపత్రికి కేటాయించి నిర్మించారని తెలిపారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు విమ్స్‌ను చిన్న చూపు చూసాయని ఆరోపించారు. 27 ఎకరాల స్థలంలో ఉన్న కెజిహెచ్‌లో రోజుకు 3500 అవుట్ పేషెంట్ నమోదవుతుంటే, 100 ఎకరాలలో ఉన్న విమ్స్‌లో మాత్రం కేవలం రోజుకు 700 నుంచి 800 ఒపి నమోదు అవుతుందని తెలిపారు. విమ్స్‌లో అన్ని వైద్య సేవలకు కనీస రుసుము తీసుకొని వైద్యం చేస్తారని, అది కూడా పెట్టుకోలేని పేదలు కెజిహెచ్‌ను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని విమ్స్‌ను పూర్తి స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిగా చేస్తే పేదలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. లాప్రోస్కోపి, ఇతర ఖరీదైనా వైద్య సేవలకు ఆరోగ్య శ్రీ లేకపోతే పేదలపై భారం పడుతోందన్నారు. ఇప్పటికీ 20 మంది డాక్టర్లను, వివిధ విభాగాల్లో మరికొన్ని నియామకాలు చేయాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చిన్నబాబు, మెహర్, శ్రీనివాస్, మహిళా నాయకులు కాండవ గాయత్రి, యూత్ కాంగ్రెస్ నాయకులు కోరిబిల్లి సాయి, జోగేంద్ర, దేవర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ జ్యూట్ మిల్లును తెరవాలి

మిల్లు గేటు వద్ద నోటీసులు అంటించి నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ గణేష్ జ్యూట్ మిల్లును వెంటనే తెరిచి కార్మికులకు పని కల్పించాలని, పాత బకాయిలను చెల్లించాలని కార్మికులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు కార్మికులు, యూనియన్ నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని తీసుకునేందుకు యాజమాన్యం నిరాకరించడంతో గేటుకు వినతి పత్రాన్ని అంటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు విజయనగరం జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ, కార్మికులు పనిచేసిన కాలానికి జీతం చెల్లించకుండా అక్టోబర్ 12వ తేదీ నుంచి యాజమాన్యం మిల్లును మూసి వేసిందని తెలిపారు. మిల్లు తెరవాలంటే బదిలీ కార్మికులంతా రాజీనామా చేసి ఎన్ఎంఆర్‌లుగా రావాలని నోటీసు బోర్డులో పెట్టడం కార్మిక హక్కులను కాలరాయడమేనన్నారు. భేషరతుగా మిల్లు తెరవాలని, జీతం ఇవ్వాలని, పిఎఫ్, డిఎ బకాయిలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నిస్తే తీసుకునేందుకు యాజమాన్యం నిరాకరించడం దుర్మార్గమన్నారు. తక్షణమే కార్మిక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జ్యూట్ మిల్ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.అప్పలనాయుడు, అప్పలరాజు, సూర్యనారాయణ, కిరణ్, రామకృష్ణ, దేవుడు, సత్యనారాయణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు, కార్యకర్తలతో ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటా : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటానని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. వైసిపికి రాజీనామా చేసిన నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సీతమ్మధారలోని ఆయన నివాసంలో ముత్తంశెట్టిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ, తాను ప్రాతినిధ్యం వహించిన ప్రతి నియోజకవర్గంలో ప్రజలతో అంటిపెట్టుకునిఉన్నానని, వారి సమస్యలు అడిగి తెలుసుకునే వాడినని చెప్పారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రాజకీయంగా తనకు అండగా నిలబడిన వారికి ధన్య వాదాలు తెలిపారు. తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతోనే పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. వేరొక పార్టీలోకి వెళ్లే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఎలాంటి కష్టం వచ్చినా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ అక్కరమాని రోహిణిరామన్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి12వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి రామన్ భూమిపూజ చేశారు. జివిఎంసి నిధులు సుమారు రూ.58 లక్షలతో వార్డు పరిధి పెదగదిలి, సాలిపేట కొండవాలు ప్రాంతాల్లో రిటర్నింగ్ వాల్స్, అపోలో ఆసుపత్రిని ఆనుకొని ఉన్న దోబీ ఖానా వద్ద రజకులకు సామాజిక భవనం నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ, సింహాచలం దేవస్థానం భూముల్లో నివాసాల ఏర్పాటు చేసుకున్న వారికి త్వరలో పరిష్కారం లభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి వర్క్స్ ఎఇ వెంకటరావు, టిడిపి నాయకులు గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవింద, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో 150 మంది విద్యార్థులకు ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం హిమోగ్లోబిన్, ఎత్తు, బరువు, దంత, నేత్ర వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ అమిత్ ప్రధాన్, ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టిఎస్‌వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండలోనే నిరసన దీక్ష

ఎండలోనే దీక్షలు చేస్తున్న కార్మికులు, కార్మిక సంఘ నాయకులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద 74 రోజులుగా చేస్తున్న దీక్షల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో ఎండలోనే కార్మికులు నిరసన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలియజేసుకునే హక్కు ఉందన్నారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని అక్టోబర్ ఒకటో తేదీ నుంచి నిరసన దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. 74వ రోజున ఉదయాన్నే పోలీసులు వచ్చి అక్రమంగా టెంట్‌ను తొలగించడం దుర్మార్గం అన్నారు. శాంతియుతంగా చేస్తున్న నిరసనలను భగ్నం చేయాలని చూడడం తగదని పేర్కొన్నారు. నిరసన కొనసాగుతుండటంతో హాస్పిటల్ టెండర్‌కి ఎవరు రావట్లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటై పోలీసుల ద్వారా ప్రతాపం చూపిస్తున్నారని విమర్శించారు. 40 వేల మంది ఆరోగ్యానికి సంబంధించి నిరసన తెలియజేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం భగ్నంచేయాలని చూడటం దుర్మార్గమన్నారు. ప్రతిపక్షంలో ఉండగా హక్కులపై మాట్లాడిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక టెంట్‌ను తొలగించారని తెలిపారు. జిల్లాకు చెందిన హోమ్ మినిస్టర్ వెంటనే జోక్యం చేసుకొని శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి అవకాశం కల్పించాలని కోరారు.

విశాఖపట్నం పోర్టుకు ఈ సంవత్సరం రూ.725 కోట్లు లాభం వచ్చిందని, గత సంవత్సరం రూ.386 కోట్లు లాభం వచ్చిందని, ఈ లాభాలు రావడంలో కార్మికుల శ్రమ కీలకమని తెలిపారు. జివిఎంసికి సంవత్సరానికి సగటున రూ.65 కోట్ల ఆస్తి పన్ను పోర్టు కడుతుందని, ఆ డబ్బులతో విశాఖపట్నం నగరంలో రోడ్లు, కాలువల అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. విశాఖపట్నం అభివృద్ధికి దోహదపడే పోర్టును, హాస్పటల్‌ను ప్రైవేటుకు దారాదత్తం చేయడమంటే అభివృద్ధిని అడ్డుకోవడమేనని పేర్కొన్నారు.

పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్‌ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణ నిర్ణయం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, సిహెచ్.త్రినాధరావు, నాయుడు, రాఘవులు, పైడిరాజు, శంకరరావు, నర్సింగరావు, శ్రీను, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను జోనల్ కమిషనర్ రాముకు వివరిస్తున్న జోజి

ఎన్‌టిఆర్ నగర్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి ఎన్‌టిఆర్.నగర్‌లో జోనల్ కమిషనర్ రాము శుక్రవారం పర్యటించారు. సెప్టిక్ నిండిపోయి నీరు బయటకు వచ్చి నిల్వ చేరడం, తాగునీటి సమస్యపై స్థానిక అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కరించేలా తక్షణమే చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి నీలాపు జోజి, నాయకులు మజ్జి మాలినాయుడు, బూత్ కన్వీనర్ దిలీప్ పాల్గొన్నారు.

విజేతలతో కళాశాల ప్రతినిధులు

ఆదర్శ్ జెన్ జీల్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- పెందుర్తి : ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో 'ఆదర్శ్ జెన్ జీల్' పేరుతో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించినట్లు కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ తెలిపారు. ఎలక్యూషన్, గ్రూప్ డిస్కషన్, స్కిట్, క్విజ్, గ్రూప్ డాన్స్ పోటీల్లో 102 మంది ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారని, వారందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు చెప్పారు.

11వ తేదీన జరిగిన ఎలక్యూషన్ పోటీల్లో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీకి మొదటి బహుమతి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాలేజీకి రెండవ బహుమతి, గ్రూప్ డిస్కషన్‌లో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీకి మొదటి బహుమతి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాలేజీకి రెండో బహుమతి, స్కిట్‌లో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ జూనియర్ కాలేజీకి మొదటి బహుమతి, సోఫియా జూనియర్ కాలేజీకి రెండో బహుమతి లభించాయని పేర్కొన్నారు.

12వ తేదీన జరిగిన క్విజ్ పోటీలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు మొదటి, రెండవ బహుమతి అందుకున్నారని తెలిపారు. 13వ తేదీన జరిగిన గ్రూప్ డ్యాన్స్ క్లాసికల్ పోటీలో ఆనంద సాయి జూనియర్ కాలేజీకి మొదటి బహుమతి, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీకి రెండవ బహుమతి, గ్రూప్ డ్యాన్స్ ఫోక్‌లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాలేజీకి మొదటి బహుమతి, సోఫియా జూనియర్ కాలేజీకి రెండవ బహుమతి, స్పెషల్ ప్రైజ్ విభాగంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, ఆనందసాయి జూనియర్ కాలేజీలు బహుమతులు అందుకున్నాయని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్.ఫ్లోరా మాట్లాడుతూ శనివారం గ్రాండ్ ఫినాలే జరగనుందని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎడికె.రాజు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌టిఎల్‌లో ముగిసిన స్వచ్ఛతా పఖ్వాడా

ప్రజాశక్తి -కరాస: ఎన్‌ఎస్‌టిఎల్‌లో స్వచ్ఛతా పఖ్వాడా వేడుకల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ, భౌతిక, ఆధ్యాత్మిక పరంగా మానవ జీవితంలో స్వచ్ఛత ముఖ్యమైన భాగం అని చెప్పారు. ఉద్యోగులందరూ సామాజిక స్వచ్ఛత శపథంతో స్వచ్ఛతా పఖ్వాడా కార్యకలాపాలను ఎన్‌ఎస్‌టిఎల్ సమీప ప్రాంతంలో స్వచ్ఛంద స్వచ్ఛత ప్రచారం నిర్వహించారని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తొలగించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. స్వచ్ఛ భారత్ అంశంపై చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ఎన్‌ఎస్‌టిఎల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ ఎ.సునీల్, జాయింట్ సెక్రటరీ అంకిత్ శర్మ, వర్క్స్ కమిటీ సభ్యులు అలోక్ చంద్, బలరామ్ కుమార్, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఒలో స్వచ్ఛతా పఖ్వాడా

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ)లో స్వచ్ఛతపఖ్వాడాలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలను శుభ్రపరచడం, కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ ఆర్‌వి.హరప్రసాద్ (నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) కార్యక్రమాన్ని ప్రారంభించి కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

దీక్షలో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీలో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు పిల్లా భాస్కరరావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమస్యలపై విశాఖ డెయిరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారమూ కొనసాగాయి. ఈ దీక్షలకు విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, విశాఖ డెయిరీలో పర్మినెంట్ కార్మికులతో పాటు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. ఐదేళ్ల సర్వీసు ఉన్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని కోరారు. 20 నుంచి 30 సంవత్సరాల అనుభవం ఉన్న కార్మికులను కూడా పర్మినెంట్ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి నాగమరనిబాబు, విశాఖ డెయిరీ కో-ఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ, కార్మికులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

మాట్లాడుతున్న వినియోగదారుల పరిరక్షణ సమితి సభ్యులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులపై విద్యార్థినులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు వి.రామానుజస్వామి మాట్లాడుతూ, వస్తువులు కొనేటప్పుడు వినియోగదారులు అన్నీ పరిశీలించాలని సూచించారు. వస్తువులు కొనేటప్పుడు ఏదైనా సమస్య ఎదురైతే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయాలని కోరారు. 90 రోజుల్లో ఈ సమస్య పరిష్కారం చేస్తామని తెలిపారు. వినియోగదారులకున్న హక్కులను తెలుసుకోవాలన్నారు. నాణ్యత తూకం, పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివిఎస్.మూర్తి, కళాశాల కరస్పాండెంట్ జయలక్ష్మి, ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మొక్కలను నాటుతున్న ఎన్‌సిసి క్యాడెట్స్, పర్వీన్

ప్రజాశక్తి -గాజువాక : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గాజువాక విజ్ఞాన్ హైస్కూల్ ప్రిన్సిపల్ కౌసర్ పర్వీన్ అన్నారు. విజ్ఞాన్ స్కూల్ ఆధ్వర్యాన ఎన్‌సిసి క్యాడెట్స్ శుక్రవారం గాజువాక హైస్కూల్ రోడ్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'ఒక చెట్టు మాతృభావం' అనే పేరుతో మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఉపయోగపడతాయన్నారు. ప్రకృతి, మాతృత్వం మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తు చేయడమే మొక్కలు నాటే ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థి దశలో చెట్లు నాటడం నేర్పించడం వల్ల పర్యావరణ పరిరక్షణకు వారు అంకితభావం కలిగి ఉంటారని తెలిపారు.

ఓరల్ హెల్త్‌పై వర్క్‌షాపు

ప్రజాశక్తి-సీతమ్మధార : మైక్రోబయోమ్ రీసెర్చ్ అండ్ ఓరల్ హెల్త్- సామాజిక ఆర్థిక స్థితి పాత్రపై లంకపల్లి బుల్లయ్య కళాశాల బయోటెక్నాలజీ విభాగం డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించాయి. కెనడాలోని మానిటోబా విశ్వవిద్యాలయానికి చెందిన రిసోర్స్ పర్సన్, ప్రొఫెసర్ ప్రశాన్ చెలికాని, మైక్రోబయోమ్ పరిశోధన, నోటి ఆరోగ్యం, దాని ప్రభావాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షర్మిలా బేగం డాక్టర్ కె. బ్యూలా, ప్రొఫెసర్ జివిఎస్‌కె.చక్రవర్తి, ప్రొఫెసర్ దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డులో కల్వర్టు పనుల నిమిత్తం కార్పొరేటర్ సారిపల్లి గోవింద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జివిఎంసి నిధులు రూ.7 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, డిఇ విజయ్‌కుమార్, ఎఇ శ్రీనివాసరావు, శ్యామలదీపిక పాల్గొన్నారు.

ఖోఖో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రా యూనివర్శిటీ ఇంటర్ కాలేజియేట్ ఖోఖో మహిళల పోటీలను ఎయు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎయు దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ శుక్రవారం విడిసిడబ్ల్యు (ఎ) కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎయు అఫిలియేషన్ కళాశాలలు నుంచి ఎమ్ఎల్ కళాశాల అనకాపల్లి, ఎంఆర్ కళాశాల విజయనగరం, జిడిసి నక్కపల్లి, ఎస్వీ ఎల్ఎన్ఎస్ భీమిలి, వివిఎస్ కళాశాల ఎంవిపి, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల, విజిడిసి ఉమెన్, సెంట్ ఆన్స్ కాలేజ్, ప్రగతి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితర కళాశాలల మహిళా జట్లు పాల్గొన్నాయని తెలిపారు. ఇంటర్ కాలేజియట్ క్రీడల్లో ప్రతిభ సాధించిన క్రీడాకారిణిలు ఏయూ ఇంటర్ యూనివర్సిటీ జట్టుకు ఎంపిక అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, విశాఖ మహిళా ఉమెన్స్ డిగ్రీ కళాశాల (విజిడిసిడబ్ల్యు (ఎ) ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పీడీ డాక్టర్ లక్ష్మణరెడ్డి, పీడీ దుర్గారావు, బివికె కళాశాల పీడీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

16న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి -చోడవరం :స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16న సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్‌కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్‌వి అప్పల నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు ఏపిఎస్ఎస్‌డిసి స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే జాబ్ మేళాలో భాగంగా ఎస్‌కెఎల్ అసోసియేట్స్, డయాకిన్ ఎయిర్ ప్రైవేట్ లిమిటెడ్, క్రెడిట్ ఆసిస్ గ్రామీణ్ లిమిటెడ్, కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని చోడవరం, మాడుగుల నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల ఇన్చెర్జ్ శ్రీనివాసును 9494791935 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని మూడు మీడియం, 11 మైనర్ సాగునీటి సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహించనున్నట్లు నీపారుదల శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారము ఉదయం 8.30 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, సాయంత్రం లోగా పూర్తి చేయాల్సింది అన్నారు. మండలంలో వారాడ. రంగల నాయుడుపాలెం, మేడిచర్ల, రావాడ జలాశయాలు మేజర్ సంఘాల కిందకు రాగా చౌడువాడ, . కే కోటపాడు, వి సంతపాలెం, గుండుపాలెం, గుల్లేపల్లి. సూరెడ్డిపాలె సింగన్న దొరపాలె కింతాడ మొదలగు సంఘాలు మైనరు సంఘాల కిందకు వస్తాయన్నారు. మీడియం సంఘాలకు ఆరు టిసి మెంబర్లు మైనరు కాలువకు 11 మంది టిసిలు ఉంటారని వారు తెలిపారు. టిసి మెంబర్లు ఎన్నికై, వారిలో ఒకరిని అధ్యక్షుని ఎన్నుకుంటారనితెలిపారు. ఎన్నికలు నిర్వహించేటప్పుడు రైతులందరూ కలిసికట్టుగా ఉండి,సామరస్యంగా టిసి మెంబర్లను అధ్యక్షుని ఎన్నుకోవాలన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రామ్మోహన్

ప్రజాశక్తి - యలమంచిలి : విద్యాసమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఎపుడూ ముందుండి పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ మూడవ మహాసభల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా సమస్యలు పరిష్కరించడంలో ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం అత్యంత దారుణమన్నారు. యలమంచిలి బిసి కాలేజ్ గరల్స్ హాస్టల్‌కు సొంత భవనం సమకూర్చాలన్నారు. విచారకరమన్నారు. అనేక ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేక ప్రైవేటు వాహనాల్లో విద్యార్థులు ప్రయాణించాల్సివస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి . గీతాకృష్ణ, ఉపాధ్యక్షులు ఎం బాలాజీ, వెంకటి, మండల కార్యదర్శి మణికంఠ, రవి, కృపా ఆనంద్, శ్రీను, భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన

ప్రజాశక్తి- కశింకోట :బైకిస్టులు విధిగా హెల్మెట్ ధరించాలని కశింకోట సిఐ అల్లు స్వామినాయుడు అన్నారు శుక్రవారం హెల్మెట్‌ధారణపై అవగాహనకు స్థానిక పోలీస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, బైక్ ప్రయాణంలో ప్రమాదాల్లో ప్రాణాలకు హెల్మెట్ రక్షణ కవచంగా ఉంటుందన్నారు. స్కూల్, కాలేజీ విద్యార్థులు హెల్మెట్‌ధారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్ కుమార్, పోలీస్ సిబ్బంది వున్నారు

బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు

తాడి గ్రామాన్ని ఆరునెలల్లో తరలిస్తా

గనిశెట్టి వినతికి ఎమ్మెల్యే పంచకర్ల స్పందన

ఎమ్మెల్యే పంచకర్లకు సమస్య విన్నవిస్తున్న గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ : ఫార్మా కాలుష్యంలో చిక్కుకుని అల్లాడుతున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. శుక్రవారం మండలంలోని తాడి గ్రామ పర్యటనకు శుక్రవారం విచ్చేసిన పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. తాడి గ్రామంలో కాలుష్యంతో ప్రజలు అల్లాడుతున్నరని, ప్రజలు ఫార్మా కాలుష్యంతో కిడ్నీ, చర్మ, ఊపిరితిత్తులు, కేన్సర్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సురక్షితనీరు, గాలి, నేలకు నోచుకోని దయనీయస్థితిలో ప్రజలు గడుపుతున్నారన్నారు అనారోగ్యంతో కునారిల్లిపోతున్నామని, తమను వేరే ప్రాంతానికి తరలించాలని ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా స్పందించడం లేదని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే పంచకర్ల స్పందిస్తూ తాడి గ్రామాన్ని ఆరు నెలలలో తరలిస్తానని హామీ ఇచ్చారని గని శెట్టి తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి-దేవరాపల్లి: మండలంలోని ఏ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24 మంది పదవ తరగతి విద్యార్థులకు ఆశ్రయ్ ఫౌండేషన్ స్టడీ మెటీరియల్ బుక్స్ వితరణ చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైస్ స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఆశ్రయ్ ఫౌండేషన్‌లో సభ్యులందరూ చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగారని అన్నారు. ప్రస్తుతం వారు పేద విద్యార్థులకు సహాయం చేస్తూ సమాజంలో తమ వంతు కర్తవ్యం నిర్వహిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అందరూ ఉన్నత స్థాయికి ఎదిగే సమాజానికి సేవ చేయాలని విద్యార్థులను కోరారు. స్టడీ మెటీరియల్ వితరణ చేసిన ఆశ్రయ్ ఫౌండేషన్ సభ్యులకు హెచ్ఎం స్వర్ణలతతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ, రొంగలి శివప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది, ఆశ్రయ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన ప్రక్రియలతో లాభసాటి వ్యవసాయం

- కిసాన్‌మేళా విధివిధానాలు మారాలి
- వ్యవసాయరంగంపై చిన్నచూపు తగదు
- ఉపాధి చట్టాన్ని సాగుకు అనుసంధానించాలి
- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కిసాన్ మేళాలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి రాష్ట్రంలో వ్యవసాయ రంగంపై 63 శాతం ఆధారపడి ఉండగా ఆ రంగాన్ని చిన్నచూపు చూడడం తగదని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగిన కిసాన్ మేళాలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కిసాన్ మేళాలో ఉపన్యాసాల కాకుండా విధివిధానాలు మార్చాలని, రైతులకు ఉపశమనం కలిగించేలా శాస్త్రవేత్తలు, అధికారులు, రైతుల మధ్య ఇంటరాక్షన్ ఉండాలన్నారు. పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో అలాగే వ్యవసాయ రంగానికి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పాడి పంటలకు సమ ప్రాధాన్యత కల్పించడం ద్వారా రైతుల ఆదాయం పెంచుకోవచ్చు అన్నారు. పరిశ్రమలకులాగే వ్యవసాయ రంగానికి రాయితీ కల్పించాలన్నారు. వ్యవసాయ రంగానికి మంచి రోజులు రావాలంటే ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలన్నారు. రాష్ట్రంలో 90 శాతం మంది రైతులు ఎకరా లోపు ఉన్నవారిని నూతన యాంత్రీకరణ రావాలంటే ప్రభుత్వమే ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు కావలసిన పనిముట్లు గ్రామాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయానికి అనుసంధానం చేయడానికి చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. రైతు ఉత్పాదకత ఖర్చు తగ్గేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఎంతోమంది చదువుకున్న వారు వ్యవసాయ రంగం చేసేందుకు ముందుకు రావడం శుభ సూచకం అన్నారు. వ్యవసాయ రంగాన్ని ఇంటిగ్రేటెడ్ విధానంలో అమలు చేయాలన్నారు. అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలాగోవింద సత్యనారాయణ, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ జిల్లాలో సహకార చక్కర కర్మాగారాలను ఆధునికరించడానికి ఎమ్మెల్యే కృషి చేయాలన్నారు. ఆర్ఏఆర్ ఎస్ పూర్వ ఎడిఆర్‌లు డాక్టర్ ప్రసాద్ రావు, డాక్టర్ జమున మాట్లాడుతూ జిల్లాలో చెరకు ఉత్పత్తి తగ్గడానికి సాగు ఖర్చు పెరగడం, ప్రభుత్వ పాలసీలు కారణమని,యాంత్రికరణ పై పరిశోధనలు మరింత పెరగాలని, వ్యవసాయ విస్తరణ విభాగం మెరుగైన పనితీరు కనబరచాలన్నారు. హార్వెస్టింగ్ యంత్రాలు మన ప్రాంతాలకు అనుగుణంగా రూపొందించాలన్నారు. ఫ్యాక్టరీల్లో పంచదార మాత్రమే కాక బెల్లం ఉత్పత్తులు కూడా జరగాలన్నారు. పలు వ్యవసాయ ప్రచురణలు ఆవిష్కరణ చేశారు. ముందుగా ఆర్ఏఆర్ఎస్ ఎడిఆర్ డాక్టర్ ముకుందరావు పరిశోధన స్థానం ప్రగతిని వివరించారుఏర్పాటుచేసిన పలు స్టాల్స్‌ను అతిథులు సందర్శించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి శివ నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర ఏపీ కొప్పుల వెలమ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీవీ జి కుమార్, డాక్టర్ భరత లక్ష్మి, డాక్టర్ ఆదిలక్ష్మి, పలువురు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - యలమంచిలి : ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు పిలుపునిచ్చారు శుక్రవారం యన కొత్తపేట పరిసరాల్లోని జూడ్స్ పాఠశాల దగ్గర వాకింగ్ ట్రాక్ పరిసరాల్లో మాస్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాస్, వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, దూది నరసింహమూర్తి, పిల్లా త్రినాధరావు, మజ్జి రామకృష్ణ, మున్సిపల్ మేనేజర్ కె.విజయకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి ఉత్తమ అవార్డులు

అవార్డు స్వీకరిస్తున్న ప్రజాశక్తి విలేకరి అజయ్

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం నిర్వహించిన కిసాన్ మేళాలో పలువురిని అవార్డులతో ముఖ్య అతిథులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పీలా గోవింద సత్యనారాయణ, మల్ల సురేంద్ర, బత్తుల తాతయ్య బాబు, పివిజి కుమార్,ఎడిఆర్ డాక్టర్ ముకుందరావు చ సత్కరించారు. చెరకు పరిశోధనలో విశిష్ట సేవలు అందించిన ు పూర్వ ఎడిఆర్ డాక్టర్ పి జమునకు యు బి రాఘవేంద్రరావు స్మారక అవార్డు, బెస్ట్ సాయిల్ సైంటిస్ట్ ఆర్ఎల్ నరసింహం స్మారక అవార్డును రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కే శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ అత్యధిక రికవరీ అవార్డు పశ్చిమగోదావరి జంగారెడ్డిగూడెం ఆంధ్ర సుగర్స్ లిమిటెడ్, అలాగే సహకార రంగంలో అత్యధిక రికవరీ అవార్డు చోడవరం సహకార చక్కర కర్మాగారం, మల్ల అమ్మాజీ స్మారక ఉత్తమ మహిళ సైంటిస్ట్ అవార్డును విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్ అనూరాధ, రాగులకొల్లు చిన్న పుల్లమ్మ స్మారక ఉత్తమ మ్యాటిటోరియస్ షుగర్ కేన్ సైంటిస్ట్ అవార్డును అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి శ్రీదేవి, మల్ల జగన్నాథం స్మారక అవార్డు బీఎస్సీ(అగ్రి) మూడవ సంవత్సరం విద్యార్థిని కొత్తకోట సాయి సుప్రియ, మల్ల పైడితల్లి స్మారక వరి ఉత్తమ రైతు అవార్డు సబ్బవరం మండలం మామిడి శంకరరావుకు, రావు బహదూర్ సివిఎస్ నరసింహారాజు స్మారక బెస్ట్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ అవార్డు చోడవరం మండలం గజపతినగరం గ్రామ కనిశెట్టి వెంకట రామారావుకు, అల్లూరి సత్యనారాయణ రాజు, ఉత్తర కోస్తా జోన్ బెస్ట్ జర్నలిస్టు అవార్డు అనకాపల్లి ప్రజాశక్తి రిపోర్టర్ మార్టూరు కొండలరావు (అజయ్) లకు అందజేశారు.

సుగర్స్ ఎమ్‌డికి సత్కారం

ఎండీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి - చోడవరం : సహకార చక్కెర కర్మాగారాల్లో అత్యధిక శాతం రికవరీ సాధించిన చోడవరం చక్కెర కర్మాగారానికి 65వ కిసాన్‌మేళాలో ప్రశంసా పత్రం జ్ఞాపికను అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అందజేశారు. సుగర్ ఫ్యాక్టరీ ఎండి వి సన్యాసినాయుడు అవార్డును స్వీకరించారు. కార్యక్రమములో విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ శివన్నారాయణ , వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, పివిజి కుమార్ పాల్గొన్నారు.

'జాగృతి' ఉత్పత్తుల స్టాల్‌కు ప్రశంసలు

ప్రజాశక్తి - సబ్బవరం.:అనకాపల్లిలో నిర్వహించిన కిసాన్ మేళాలో జాగృతి జాగతి సంస్థ వ్యవసాయ ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తులతో స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు సంస్థ ఎండి కందర్ప సుజాత తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఉత్పత్తి చేసిన వ్యవసాయ ఉత్పత్తులను ఏడు రైతు ఉత్పత్తిదారుల కంపెనీల పాలకవర్గ సభ్యులు, రైతులు సుమారు 90 మంది పాల్గొని ప్రదర్శించారని తెలిపారు. కిసాన్‌మేళాలో తమ సంస్థకు ప్రశంస బహుమతి లభించిందన్నారు. కార్యక్రమంలో జాగతి అగ్రి కన్సల్టెంట్ వంటకు రెడ్డి నాయుడు, వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ శ్రీమన్నారాయణ, సిహెచ్. ముకుందరావు, జగన్నాధరావు పాల్గొన్నారు.

నారపాడు సర్పంచ్‌కు ఉత్తమ రైతు అవార్డు

ఎమ్మెల్యే నుంచి అవార్డు స్వీకరిస్తున్న శంకరరావు

ప్రజాశక్తి -సబ్బవరం. : మండలంలోని బలిజిపాలెం గ్రామానికి చెందిన నారపాడు సర్పంచ్ మామిడి శంకరరావు కు జిల్లా ఉత్తమ రైతు అవార్డు లభించినట్లు స్థానిక మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగిన 65వ కిషన్ మేళా కార్యక్రమంలో మల్లపైడితల్లి మెమోరియల్ ప్రైజ్ పేరిట ప్రతి ఏటా రైతులకు ఉత్తమ రైతు పురస్కారాలు అందజేస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది మామిడి శంకర్రావుకు అవార్డు వరించిందన్నారు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అవార్డును మామిడి శంకర్రావుకు అందజేసినట్లు తెలిపారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు, మిశ్రమ పంటల సాగు, వరి సాగులో నూతన పద్ధతులు, యాంత్రికరణ వంటి విధానాలకు శంకర్రావుకు ఈ అవార్డు దక్కిందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పై రైతులకు ప్రోత్సహించినట్లయితే వ్యవసాయ రంగంలో రైతులందరూ మెరుగైన ఫలితాలు సాధిస్తారని ,పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని శంకరరావు సూచించారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని పురుషోత్తపురంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం జరిగింది. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బెహరా ప్రసాదరావు శిబిరాన్ని ప్రారంభించి లింగనిర్ధారిత కార్యక్రమంలో ఆడ పెయ్యిలను పుట్టాలంటే అందుబాటులో ఉన్నసాంకేతికను వివరించారు. పిండ మార్పిడిపై యలమంచిలి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సి. హెచ్.ఎం.ఎం.గంగాధర్ వివరించారు. జిల్లా పశగణాభివృద్ధి సంస్థ విశాఖ పట్నం, అనకాపల్లి సౌజన్యంతో రాష్ట్రీయ గోకుల మిషన్ నిధులతో నిర్వహించిన శిబిరంలో ఏటికొప్పాక పశు వైద్యాధికారిఎస్ దేవరాజు, శస్త్ర చికిత్సనిపుణులు డాక్టర్ పి.బాసుబాబు పాల్గొన్నారు.శిబిరంలో 36 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో 31 మంది రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక జర్నలిస్ట్ క్లబ్ ఆవరణలో శుక్రవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హెల్పేజ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. . ఈ సదస్సుకు లంకపల్లి మనోల్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్, అల్లు కృష్ణారావు స్టేట్ కోఆర్డినేటర్ హెల్ప్ ఏజ్ ఇండియా తరపున హాజరై వృద్ధులకు అవగాహన కల్పించినారు. హెల్పేజ్ ఇండియా 75 దేశాల్లో పనిచేస్తుందని, మన దేశంలో 1975లో సేవలు ప్రారంభించి, వృద్ధులకు ముఖ్యంగా సైబర్ నేరాల పై అవగాహన కల్పిస్తోందన్నారు. డిజిటల్ లిటరసీ, వీలునామా, స్మార్ట్ ఫోన్ వాడకంపై వివరించారు. సైబర్ క్రైమ్ నేరం జరిగిన ఒక గంటలో గోల్డెన్ అవర్ 1930 కాల్ చేస్తే మనకు పోగొట్టుకున్న డబ్బు తిరిగి పొందవచ్చన్నారు. వృద్ధులకు హెల్ప్ లైన్ 1800 1801253 నెంబర్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీలునామాపై వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొరపేటి మాస్టారు, డాక్టర్ ఎంబిటి స్వామి,తమ్మి రాజు మాస్టారు, విల్లూరి సత్యనారాయణ, సెక్రటరీ పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై వైసిపి నిరసనలు

- జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు
- విశాఖ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

రైతాంగ సమస్యలపై వైసిపి ఆధ్వర్యాన శుక్రవారం విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అన్నదాతకు అండగా పేరుతో వైసిపి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ర్యాలీలో అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి చేపట్టిన ర్యాలీ కలెక్టరేట్‌కు చేరిన సందర్భంలో కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు వైసిపి నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పార్టీ నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. తోపులాట చోటుచేసుకుంది. తోపులాటలో గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య స్వల్పంగా గాయపడ్డారు. అనంతరం పోలీసులు కొద్ది మంది నాయకులను లోపలకు వెళ్లేందుకు అనుమతించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నాయకత్వంలో బృందం డిఆర్ఒ భవానీ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సూపర్ సిక్స్ అని చెప్పిన కూటమి ప్రభుత్వం డక్ అవుట్ అయిందని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయప్రసాద్, తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసనలు విజయవంతం : ఎమ్మెల్సీ బొత్స

ఎంవిపి.కాలనీ : అన్నదాతకు అండగా పేరిట వైసిపి ఆధ్వర్యాన చేపట్టిన రాష్ట్ర వ్యాప్త నిరసనలు విజయవంత మయ్యాయని ఎమ్మెల్సీ బొత్స సత్య నారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందో కూడా కనీసం చెప్పడం లేదన్నారు. నీటి సంఘాల ఎన్నికలను వైసిపి తరుపున బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

అనకాపల్లి :అన్నదాతలకు వైసిపి ఎల్లప్పుడు వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాల నాయుడు, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల కుమార్ రాజా ఆధ్వర్యంలో అన్నదాతకు అండగా వైసిపి, కూటమి సర్కార్ పై నిరసన గళం పేరుతో ఆందోళన చేపట్టారు. పెద్ద ఎత్తున ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని జెసి ఎం జాహ్నవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ రైతులకు తక్షణమే పెట్టుబడి సహాయం ఏడాదికి రూ.20వేలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, దళారీ వ్యవస్థను తొలగించాలని, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కళ్లతో రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని డిమాండ్ చేశారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, రైతుపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్ రాజ్, కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, దంతులూరి దిలీప్ కుమార్, బొడ్డేడ ప్రసాద్, మలసాల కుమార్ రాజా, మంద పాటి జానకి రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జాజుల రమేష్, కె యం నాయుడు, దాడి నారాయణ రావు, మరిపల్లి శోభ, గైపూరిరాజు, గండి రవికుమార్ పాల్గొన్నారు.

మునగపాక: అన్నదాతకు అండగా వైసిపి కలెక్టర్ ముట్టడికి వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో తన క్యాంపు కార్యాలయం నుంచి భారీగా పార్టీ శ్రేణులు ర్యాలీకి తరలివెళ్లారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, నాయకులు దాసరి అప్పారావు, కోనపల్లి రామ మోహన్ రావు, మద్దాల వీరి నాయుడు, దొడ్డి బుజ్జి, రాజాన బుజ్జి బాబు, కాశి బాబు పాల్గొన్నారు.

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి శ్రేణులు

ప్రేక్షకుల ఆదరాభిమానాలు కావాలి

సినిమా పిచ్చోడు చిత్ర విడుదల సందర్భంగా హీరో కుమారస్వామి



మాట్లాడుతున్న హీరో కుమారస్వామి

ప్రజాశక్తి- దేవరాపల్లి : సినీ పరిశ్రమలో మరింత స్థాయికి ఎదగాలంటే ప్రేక్షకుల ఆదరాభిమానాలు ఎంతో అవసరమని యువ హీరో కుమార్‌స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన కుమారస్వామి నటుడుగా, డైరెక్టర్‌గా రూపొందించిన 'సినిమా పిచ్చోడు' చిత్ర యూనిట్ శుక్రవారం దేవరాపల్లిలో సందడి చేసింది. స్థానిక మహేశ్వరి థియేటర్లో ప్రదర్శించిన ఈ చిత్రాన్ని హీరో కుమారస్వామి, ఉదయం ఆటను స్థానికులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తన స్వస్థలంలో సినిమా చూడడం ఎంతో ఆనందంగా ఉందని, ముందు ముందు అనేక సినిమాలు తీస్తానన్నారు. గతంలో తీసిన హెచ్ 23, జగన్నాటకం సినిమాలు మంచి గుర్తింపును తెచ్చాయన్నారు. వాటిలాగే సినిమా పిచ్చోడు మూవీకి మంచి ఆదరణ లభిస్తుందనకపనేజ తనను ఆదరించిన ఈ ప్రాంత ప్రజలందరికీ ఈ సందర్భంగా హీరో కుమార్ స్వామి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం థియేటర్ వద్ద కేక్ కట్ చేసి, చిత్రం యూనిట్ సభ్యులతో సందడి చేశారు.కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, థియేటర్ యజమాని ఎల్లేటి కరుణాకర రావు, గొర్లె దేవుళ్ళు, దుక్క సత్తిబాబు, గండేపల్లి శ్రీనివాసరావు, మారేపల్లి టిడిపి నాయకులు కిల్లి గోవింద, సోమినాయుడు, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి - పరవాడ : జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో సంస్కృతి గ్లోబల్ స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలు శుక్రవారం ఘనంగా ముగిసాయి. జిల్లా నలుమూలల నుండి సుమారు 30 మంది క్రీడాకారులు హాజరై ఈ ఎంపిక లోప్రతిభను చాటుకొన్నారు. వీరిలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో మెరుగైన ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 23 నుండి 25 వరకు రాజమండ్రిలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని విశాఖపట్నం జిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొను ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఇండియన్ రౌండ్ బాయ్స్ లలిత్ సాయి, మోహిత్ సాయి, నాభ్య ప్రభాత్, పూర్వ్ రాథోడ్, గర్ల్స్ బి.వైష్ణవి, సాహితి, సాయి మనస్వి, హర్షిత, కాంపౌండ్. బాయ్ అండ్ గర్ల్స్ హర్ష, సాహిత్ , వి.యశస్వి, వి.ఆద్య రికర్వ్ బాయ్స్ అండ్ గర్ల్స్ సాత్విక్, అరియనా, తన్మయి, ఎంపికయ్యారన్నారు. స్టాండ్ బైలుగా అశోక్, తేజేశ్వర్, ప్రణీత్ , కీర్తిఉన్నారని జిల్లా ఆర్చరీ సంఘం ఉపఅధ్యక్షులు సత్యనారాయణ తెలిపారు. పోటీలను నిర్వహించడం లో ముఖ్య పాత్ర పోషించిన కోచ్‌లు కె. గోవింద్, వి. శివకుమార్‌లను జిల్లా ఆర్చరి అధ్యక్షులు పి. సూర్య నారాయణ రెడ్డి అభినందించారు.

త్వరలో కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : త్వరలో అన్ని మండలాలకు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను నియమిస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మీసాల సుబ్బన్న తెలిపారు.శుక్రవారం రాజాంలో మీడియాతో మాట్లాడారు.మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు,అనుబంధ సంఘాలకు కార్యవర్గాన్ని ఎంపిక చేసి పార్టీ బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో అధికార,ప్రతిపక్ష పార్టీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలు రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల వైపు చూస్తున్నారన్నారు. పిసిసి అధ్యక్షురాలిగా షర్మిల నాయకత్వంలో 2029 నాటికి పార్టీని అధికారంలోకి తీసుకు వస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,పెన్షన్ల తప్ప మరో పథకాన్ని అమలు చేయలేదన్నారు.ఆరు నెలల్లోనే టిడిపిపై వ్యతిరేకత మొదలైందన్నారు. విద్యుత్ ఛార్జీలపై చంద్రబాబు ప్రభుత్వం మాటమార్చిందన్నారు.

ఘనంగా వెంకటేష్ జన్మదిన వేడుకలు

విద్యార్థుల సమక్షంలో వెంకటేష్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని ఒంపోలు గ్రామంలో సినీ నటుడు వెంకటేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు పి చందు ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు. వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ ముఖ్య ప్రోత్సాహకులు శ్రీకాకుళం రాజు మాట్లాడుతూ వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో విక్టరీ వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు పి చందు మాట్లాడుతూ వచ్చే సంక్రాంతికి రాబోతున్న వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించారు. వెంకటేష్ పుట్టినరోజు కేక్ కట్ చేశారు. అనకాపల్లి పట్టణ వెంకటేష్ ఫ్యాన్స్ పి.చందు, గాజువాక రాజు, లాయర్ శ్రీను, కొంగా నాగేశ్వరావు, రోషన్ కుమార్, రాయివెంకటరమణ, సోమేష్, రాము, కిరణ్, లక్ష్మణ , నాగవరంశ్రీను పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలోని సీయోను ప్రార్ధన మందిరంలో మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ జాన్ విక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి అధ్యక్షులు గ్రామ సర్పంచ్ బూరె బాబురావు, సబ్బవరం నుండి విజయకుమార్, పాస్టర్లు డేవిడ్ లివింగ్ స్టోన్, రవి కుమార్, ఎం.శ్యామ్ బాబు, ఎన్. శామ్యూల్రాజ్, బి.జాన్ టైటస్ పాల్గొని, కేక్ కట్ చేసి ప్రార్థనా గేయాలతో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. కోఆప్షన్ సభ్యులు జాన్ విక్టర్ ఆర్థికసాయంతో చీరలను విజయ్ కుమార్, బూరె బాబురావు పంపిణీ చేశారు. వైసిపి యువజన విభాగం ప్రధానకార్యదర్శి బొబ్బిలి రాము పాల్గొన్నారు

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

నక్కపల్లికి చేరుకున్న పోలింగ్ సామగ్రి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఈనెల 14వ తేదీ శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇరిగేషన్ డిఈ ఎస్ జగదీశ్వరరావు, ఏఈ జె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం పోలింగ్ సంబంధించిన సామగ్రిని భద్రపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి మండలంలో 15, పాయకరావుపేట మండలంలో 7, ఎస్.రాయవరం మండలంలో 19, కోటవురట్ల మండలంలో 7 ఆయకట్టు చెరువులకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం చేశామన్నారు. నక్కపల్లి మండలంలోని వేంపాడు లో 2, గుల్లిపాడు 2, చినదొడ్డిగల్లు 3, గొడిచెర్ల 2, జి జగన్నాధపురంలో పెద్ద చెరువు, చీడికలో రిజర్వాయర్, ఉద్దండపురంలో ఊర చెరువు, కాగితలో రాయపురాజు చెరువు, రమణయ్యపేటలో తిరుపతి రాజు చెరువు, నెల్లిపూడిలో ఊర చెరువులకు సంబంధించి ఒక్కొక్క చెరువుకు 6గురు సభ్యులు, వారిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఎన్నికలు ఏకగ్రీవంగా జరగకపోతే, చేతులెత్తే విధానంలో ఎన్నిక నిర్వహిస్తామని, చేతులెత్తే విధానం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తే, బ్యాలెట్ విధానంలో ఎన్నిక నిర్వహిస్తామని వెల్లడించారు.

రోలుగుంట: ఈ నెల 14న మండలంలో 10 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు నీటిపారుదలశాఖ కొత్తకోట సెక్షన్ ఏఇఇ సూర్యనారాయణ తెలిపారు. మండలంలో కంచుగుమ్మల తిమ్మరాజుచెరకు, అడ్డసరం తివ్వలగెడ్డ, కొవ్వూరు, కసుమలచెరువు, పోతలవాని చెరువు, నిండుగొండ, పినపోతులవాని, జానకిరాంపురం అనిమిరెడ్డి వాని చెరువు, కుసర్లపూడి కైసర్లవాని, గుండుబాడు ఆనకట్టు, జె.నాయుడుపాలెం దొరచెరువు, కొమరవోలు, కొమరవోలు ఆవకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో పాఠశాలల్లో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేశామన్నారు. 14న శనివారం ఉదయం నామినేషన్ల స్వీకరణ అనంతరం ఒంటి గంటకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరగనున్నట్లు తెలిపారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ

గొలుగొండ: ఈ నెల 14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు శుక్రవారం గొలుగొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారి రుత్తల రవికిరణ్ ఎన్నికల విధులు, నిబంధనల గురించి వివరించారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మేరీరోజ్ పాల్గొన్నారు.

పలుచోట్ల రెవెన్యూ సదస్సులు

నక్కపల్లిలో వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని పెదదొడ్డిగల్లులో సర్వే నెంబర్ 1లో గల భూమిలో పట్టాలు ఇవ్వాలని కోరుతూ గ్రామస్తులు తహసిల్దార్ నరసింహామూర్తికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ గొర్ల విజయలక్ష్మి, నాగ అప్పలరాజు, గొర్ల గోవింద్ తదితరులు తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నెంబర్1లో 334 ఎకరాలు భూమి ఉందని, గ్రామ పెద్దలు ఆ భూమిని గ్రామానికి చెందిన ఒక్కొక్కరికి 80 సెంట్లు చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. సుమారుగా 40 సంవత్సరాల నుండి గ్రామ ప్రజలు వారికి కేటాయించిన భూమిలో పశువులు, మేకలు మేపు కుంటూ జీవనం సాగిస్తున్నారని, కొంతమంది దళారులు రెవెన్యూ రికార్డులు తారుమారు చేయించి,ఆ భూములు విక్రయించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని తహసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆ భూమి అన్యాయాక్రాంతం కాకుండా చూడాలని, సాగులో ఉన్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. పోలవరం కాలువకు సంబంధించి భూసేకరణ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సత్తిబాబు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్ రాయవరం : రెవెన్యూ సదస్సుల్లో రైతాంగ అర్జీల సత్వర పరిష్కార దిశగా చర్యలు చేపట్టినట్లు తహశీల్దారు జె.రమేష్‌బాబు తెలిపారు. కొరుప్రోలు శ్రీ నూకాలమ్మతల్లి ఆలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రి సూరివేణి, మండల సర్వేయర్ మూర్తి, వీఆర్వో శ్రీధర్, నూకరాజు,మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: రైతుల సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసిల్దారు తిరుమలబాబు తెలిపారు. వెంకటాపురం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 71 వరకు దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

గొలుగొండ: రైతుల భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసిల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాతమల్లంపేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి : అటవీ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని వాలాబు రెవెన్యూ సదస్సులో గిరిజనులు డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి దొరతో కలిసి తాసిల్దార్ లక్ష్మీదేవికి వినతిపత్రం సమర్పించారు. గతంలో వాలాబు పంచాయతీలో కొందరికి పోడు, అటవీ బంజరు భూములకు పట్టాలు ఇచ్చారని, మిగిలిన వారికి ఏళ్ల తరబడి మొరపెట్టుకున్నా స్పందించడం లేదన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, పోడేల బుజ్జి పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని చీపురుపల్లి తూర్పు రెవెన్యూ, నాయుడుపాలెం గ్రామ పంచాయతీ రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఎస్‌వి.అంబేద్కర్‌కు ప్రభుత్వ భూములను ,మంచినీటి బావులు, వాగులు, గెడ్డలు స్థలాలను, మత్స్యకార అభివృద్ధి భవనాల స్థలాలను ప్రభుత్వ భూములను భూకబ్జాదారుల నుండి పరిరక్షించాలని కోరుతూ, ఆంధ్రా మత్స్యకార జేపిసీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు అర్జిల్లి అప్పలరాజు వినతిపత్రం సమర్పించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పి.కందిపూడిలో శుక్రవారం తహశీల్దార్ లక్ష్మి ఆధ్వర్యంలో రెవిన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులు అర్జీలు అందజేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొప్పాక గణేష్, మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డి నాయుడు, జనసేన మండల పార్టీ

మాట్లాడుతున్న బుచ్చయ్యపేట తహశీల్దార్ లక్ష్మి

అధ్యక్షులు ద్వారపురెడ్డి సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం. : మండలంలోని బంగారమ్మపాలెం, అడ్డూరు శిరసపల్లి గ్రామాలలో రెవిన్యూ సదస్సులలో తహశీల్దార్ చిన్నికృష్ణ పాల్గొని వినతులు స్వీకరించారు. లింగేశ్వర స్వామి దేవస్థానం భూములను ఆన్లైన్ చేసి దేవస్థానానికి అప్పగించాలని ఆలయ గుమస్తా పి.ఎన్.వి సత్యనారాయణ తహశీల్దార్‌కు అర్జీ అందజేశారు. సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు, మాజీ ఎంపీటీసీ దొడ్డి అరుణ సూర్య ప్రకాశరావు, రీ సర్వే డి.టి గణపతిరావు, రిజిస్ట్రేషన్ సిబ్బంది జయలక్ష్మి , వెలుగు సర్వేయర్ రాంబాబు, గ్రామ వీఆర్‌ఓ నాగేశ్వర రావు, వైస్ సర్పంచ్ అంగటి సూరిబాబు, మండల సర్వేయర్ ఎల్. అప్పారావు, విలేజ్ సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు

కాపులుప్పాడలో రెవెన్యూ సదస్సు

భీమునిపట్నం : జీవిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడలో తహశీల్దార్ పైలా రామారావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 35 మంది రైతుల అనుభవంలో ఉన్న 8 ఎకరాల భూమిని విభజించి "22 ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించి" న్యాయం చేయాలని కాపులుప్పాడ, కె.నగరపాలెం, గొల్లలపాలెం రైతులు సదస్సులో కోరారు. పలువురు రైతులు వివిధ రకాల భూ సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం వల్ల కలిగే నష్టాలను గమనించి, ఆ చట్టాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ కె.సంగీత్‌మాధుర్, జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి, ఆర్ఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- ఎస్.రాయవరం: కొరుప్రోలు గ్రామ పంచాయితీలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంను ఎంపిడివో సత్యన్నారాయణ నేతృత్వంలో నిర్వహించారు. శుక్రవారం ఉదయం కొరుప్రోలు కల్లుగోతుల వద్ద ఉన్న చెత్తను వివిధ గ్రామాల నుండి వచ్చిన పారిశుధ్య కార్మికులతో తీయించి ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శనివారం ఒక గ్రామాన్ని తీసుకుని పారిశుధ్య కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గ్రామస్తులు చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయకుండా చెత్త బళ్లలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ శ్రీనువాస్, పంచాయితీ కార్యదర్శి రామలక్ష్మి, పెదగుమ్ములూరు కార్యదర్శి సత్యన్నారాయణ, గుడివాడ కార్యదర్శి నాగరాజు, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఇంధన పొదుపు భవితకు మరింత వెలుగు అని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీడివి రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం అయిన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 14 శనివారం నుండి 20వ తారీకు వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఈనెల 14న అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఇంధన పొదుపుపై ర్యాలీ కలక్టర్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. 15న స్వయం సహాయక బృందాలకు వర్క్ షాప్, 16నవేములపూడి మోడల్ స్కూల్ విద్యార్థులకు, చోడవరం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 17న కాలేజీ విద్యార్థులకు అవగాహన, 18న ప్రభుత్వ కార్యాలయాలలో కరపత్రాల పంపిణీ, బ్యానర్ల ప్రదర్శన, 19న గ్రామాలలో కళాజాత (బుర్రకథ), 20న పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందన్నారు. ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు.

హాజరైన అధికారులు, సిబ్బంది

ముగిసిన ప్రత్యేక శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-రోలుగుంట: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎల్‌ఎస్‌డిజిఎస్ కార్యాచరణ ప్రణాళికపై రెండు రోజుల పాటు జరిగిన శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఈవోపిఆర్‌డి చిరంజీవి మాట్లాడుతూ..రెండవ రోజు జరిగిన శిక్షణా కార్యక్రమంలో పారిశుధ్యం, సురక్షిత మంచినీటి వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి : మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులపాటు ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్ మేనేజర్ చిన్నారావు అవగాహన కల్పించారు. ఏపీఎస్ఐఆర్డి డిప్యూటీ డైరెక్టర్ జె.రామనాథం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

17,18 తేదీల్లో శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- రావికమతం: ఈనెల 17 ,18 తేదీలలో రెండు రోజుల పాటు సర్పంచులకు, మండల స్థాయి అధికారులకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సమన్వయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. మండల కేంద్రం వెలుగు సమావేశ మందిరంలో ఈ శిక్షణా తరగతులను నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి బ్యాచ్ కి ఈనెల 12 ,13 తేదీలలో శిక్షణ తరగతులను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -రావికమతం: పాఠశాలలో ఆవరణలో ఆక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలంటూ మండలంలోని మేడివాడ పంచాయతీ శివారు అప్పలమ్మపాలెం గ్రామానికి చెందిన కూటమి నాయకులు మడక సత్తిబాబు, అప్పి కొండ భాస్కరరావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ పాఠశాలకు ప్రహరీ నిమిత్తం ఇటీవలే 9 లక్షల రూపాయలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయన్నారు. పాఠశాల ఆవరణలో పునాదుల నిర్మాణం గత రెండేళ్ల క్రితం జరిగిందని, అప్పట్లో పాఠశాల ఆవరణలో కట్టడానికి వీలులేదని గ్రామస్తుల అడ్డుకోవడంతో ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టలేదన్నారు. రెండేళ్ల క్రితం స్కూలు ఆవరణలో ఆక్రమణకు గురైన పునాదులను తొలగించాలంటూ గతంలో తగాదాలు పడిన విషయం తెలిసిందే అన్నారు. ఆక్రమణలు తొలగించకపోతే ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని వారు హెచ్చరించారు.

విద్యుత్ భారాలపై నిరసనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం వేసిన ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను బిగింపును ఆపి, ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని, కోరుతూ శుక్రవారం అనకాపల్లి గవరపాలెం పార్కు సెంటర్ వద్ద పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కరెంట్ బిల్లులు దహనం చేస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజలు, పాదాచారులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు కాళ్ళ తెలయ్య బాబు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు, ఇపుడు ముందుకు రావడం దుర్మార్గమని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. రిటైర్డుద్యోగి రామకృష్ణ మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల వినియోగదారులకు తీవ్రమైన నష్టం కలుగుతుందన్నారు.కార్యక్రమంలో పెంటకోట శ్రీనివాసరావు, ఎస్ శివరాం, ఏజె రామకష్ణ, పెంటకోట సూర్య అప్పారావు, బొడ్డేడ వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని అచ్యుతాపురం జంక్షన్ లో శుక్రవారం సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము మండల కమిటీ సభ్యులు కె సోమునాయుడు ఆధ్వర్యంలో బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా రాము సోమనాయుడు మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచబోమనిఎన్నికలలో టిడిపి కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ల వద్దని, పెడితే పగలగొట్టండనిప్రతిపక్షంలో ఉండగా పిలుపునిచ్చారని, ఇపుడు బిగింపునకు ముందుకు రావడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వ మోసకారి విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చొప్ప రమణ, బి. గణేష్, డి. శంకర్,,అప్పారావు ప్రజలు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో బిల్లులు దగ్ధం చేస్తున్న నాయకులు

ఎస్.రాయవరం :పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మండలంలో బంగారమ్మపాలెంలో గ్రామ ప్రజలతో సిపిఎం నేతలు ఆందోళన చేపట్టారు. విద్యుత్ బిల్లులను దహనం చేసారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.సత్యానారాయణ మాట్లాడుతూ, కరెంటు చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని గత ఎన్నికల్లో టిడిపి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి మరచి పోయిందన్నారు. స్మార్ట్ మీటర్లు వద్దని, పెడితే పగలగొట్టండని కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉండగా పిలుపునిచ్చారని, అధికారంలోకి రాగానే మాట తప్పి సర్దుబాటు చార్జీల భారం వేశారన్నారు. పాత మీటర్లు తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు.ఈ మీటర్లు ముందు ప్రభుత్వ కార్యాలయాలలో పెట్టారని, ఇప్పుడు షాపులు, సంస్థలలో బిగిస్తున్నారన్నారు. త్వరలో అన్ని ఇళ్లకు బిగిస్తారని తెలిపారు.ఈ ప్రీ పెయిడ్ మీటర్ కు ఫోన్ బ్యాలెన్స్ వేయించుకున్నట్లు, వేయించుకోవాలని, ఆ డబ్బు అయిపోగానే కరెంటు ఆగిపోతుందన్నారు.. మళ్ళీ రీఛార్జ్ చేయించుకోవాలని తెలిపారు. ఈ మీటర్ కు అయ్యే ఖర్చును కరెంటు బిల్లుతో పాటు నెలకు 100 నుండి 150 రూపాయలు వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారని తెలిపారు.ఎస్సీ, ఎస్టీ, వృత్తిదారులకు ఇచ్చే రాయితీలు క్రమంగా తొలగిస్తారని పేర్కొన్నారు. గత నెల కంటే ఈనెల 40 శాతం పైగా కరెంటు చార్జీలు పెరిగాయని తక్షణమే ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ప్రజల సమీకరించి ఉద్యమిస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో మైలపల్లి మాధవ, మైలపల్లి వరహాలమ్మ, బుజ్జమ్మ, ఎర్రయ్య మహిళలు పాల్గొన్నారు.

అనకాపల్లిలో పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిరసన

ఆందోళన చేస్తున్న రైతులు

రైతుల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి:సాగునీటి తీరువా పన్నులు కట్టించుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఉద్దండపురం ఊర చెరువు, గొడిచెర్ల కొత్తచెరువు, బాపిరాజు ఆయకట్టు చెరువులు సంబంధించిన పలువురు రైతులు తహసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ, వైస్ ఎంపిపి నానాజీ, ఉద్దండపురం సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు బచ్చల రాజు, మాజీ ఎంపిపి బొల్లం బాబ్జి, పాపారావుల ఆధ్వర్యంలో సాగునీటి ఎన్నికలకు సంబంధించి పోటీలో నిలిచే వైసిపి అభ్యర్థుల నీటి తీరువా పన్నులు కట్టించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాగునీటి సంఘాల ఎన్నికల్లో ప్రత్యర్థులు పోటీ చేయకుండా కూటమి పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. రైతుల భూములకు నీటి తీరువా కట్టించుకోకుండా వీఆర్వోలపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, ప్రత్యర్థి అభ్యర్థుల పై అనర్హత వేటు వేసి, దొడ్డిదారిన గెలుపొందాలని చూస్తున్నారన్నారు. నీటి తీరువా పన్నులు కట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వోలు సంబంధిత రైతులకు నీటి తీరువా పన్నులు కట్టించుకుని రసీదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఇఒ

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మార్చి నెలలో జరుగనున్న 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ లు కె.నరేష్, వేమగిరి నూకరాజు సూచించారు. మండలంలోని పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం వారు ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సెలవు రోజులలో ఉపాధ్యాయులు నిర్వహించే ప్రత్యేక తరగతులకు విద్యార్థులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ఉపాధ్యాయులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అందరికీ హెూలిస్టిక్ కార్డులను ఇచ్చారో లేదో అడిగి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రిజిష్టర్‌లను పరిశీలించారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విశాఖపట్నం : సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో అనువర్తిత గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, సాంఖ్యాక శాస్త్ర విభాగాధిపతి, పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ బి.మునిస్వామి, గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ అనురాధ కామేశ్వరి, సాంఖ్యాక శాస్త్ర విభాగ ప్రాంగణంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ప్రొఫెసర్ యంవిఆర్.రాజు, ఎయు సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రధానోపాధ్యాయులు ముఖ్య అతిథిగా విచ్చేసి రక్త దానం ప్రాముఖ్యతను వివరించారు.

గిరిజన విద్యార్థిని మృతి

- హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యమే కారణం : తల్లిదండ్రుల ఆరోపణ

- వసతి గృహం ముందు బైఠాయింపు

ప్రజాశక్తి - మాడుగుల:గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థిని మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ సంఘటన మాడుగుల మండలం తాటిపర్తి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకుంది. మృతదేహంతో కుటుంబ సభ్యులు ఆశ్రమ పాఠశాల ఎదురుగా నిరసనకు దిగి రోడ్డుపై బైఠాయించి తన కుమార్తె చావుకి కారకులైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల కథనం మేరకు. ... తాటిపర్తి గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో మురల సత్యవతి(14) 9వ తరగతి చదువుతుంది.గత నాలుగైదు రోజులుగా ఆరోగ్యం బాగోలేదని, ఈ విషయమై ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలికి, వార్డెన్‌కి తెలిపినప్పటికీ పరీక్షల సమయంలో ఎక్కడికి వెళ్లరాదని చెప్పడంతో ఆ విద్యార్థిని అక్కడే ఉండిపోయింది. తమకు సమాచారం ఇవ్వమని అడిగినప్పటికీ కూడా ఏమీ అవసరం లేదని చెప్పారని విద్యార్థిని తల్లిదండ్రులు వాపోతున్నారు. సోమవారం నుండి ఆరోగ్య పరిస్థితి బాగోలేనప్పటికీ తమకు సమాచారం ఇవ్వలేదని, గురువారం మాడుగుల లో జరిగిన వారపు సంతకు రావడంతో విషయం తెలిసిందని తెలిపారు. దీంతో మాడుగుల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగిందని తల్లితండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. సచివాలయ ఏఎన్ఎం కూడా మాడుగల సిహెచ్సికి తరలించాలని పాఠశాల చిక్కుబుక్కులో రాసినా తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. చోడవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందిందన్నారు.

సర్పంచ్ జీరుగు బోయిన ఈశ్వరరావు మాట్లాడుతూ గతంలో కూడా ఓ విద్యార్థిని అనారోగ్యంతో బాధపడి మృతి చెందినప్పటికీ అధికారులు, నాయకులు ఆ సంఘటనను కప్పిపుచ్చారన్నారు. దేవాపురం సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ పిల్లలతోనే పనులు వెట్టిచాకిరి చేయించడం కళ్ళతో చూస్తున్నామని పేర్కొన్నారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

దీనిపై జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని నాగ శిరీష మాట్లాడుతూ, విద్యార్థిని మృతికి సంబంధించి పూర్తిస్థాయి వివరాలు తెలుసుకొని కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, వార్డెన్ మహేశ్వరిలు మాట్లాడుతూ, తాము పిల్లలను సక్రమంగా చూసుకుంటున్నామని, సచివాలయంకి తీసుకెళ్లి ఇంజక్షన్ వేయించామన్నారు.సంఘటన స్థలానికి అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి తో పాటు చోడవరం సీఐ, మాడుగుల ఇన్చార్జ్ ఎస్సై జోగారావు చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని విశాఖపట్నం కెజిహెచ్ కి తరలించారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఎమ్మెల్యేకు రైతుల వినతి

ప్రజాశక్తి వడ్డాది: నీటి సంఘం ఎన్నికలు నిర్వహించాలని బుచ్చయ్యపేట మండలం లోపూడి, బంగారు మెట్ట గ్రామ రైతులు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ. లోపూడి గ్రామ పరిధిలో ఉన్న గుర్రపు గడ్డ ఛానల్ కింద సుమారు 650 ఎకరాలు వ్యవసాయ భూములు ఉన్నాయని అన్నారు. ఆరు ఆనకట్లు ఉన్నాయని అన్నారు. వీటి కింద సుమారు 650 ఎకరాలు భూములు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి మంజూరు చేసే నిధులతో ఆనకట్టలను అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామని అన్నారు.ఈసారి నీటి సంఘం ఎన్నికలు జాబితాలో గుర్రపు గెడ్డ ఛానల్ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నామని అన్నారు. మా గ్రామానికి నీటి సంఘం ఎన్నికలు నిర్వహించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రాయూనివర్సిటీ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల వాలీబాల్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టును ఎయు వ్యాయామ విద్యావిభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, ఎయు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీ ఆఫ్ కేరళలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు పురుషుల వాలీబాల్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జట్టు కోచ్ శివాజీ రాజు, గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ దిలీప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్, శ్రీ కాశ్యప్ పీడీ శ్రీనివాస రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఒ

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని మండల పరిషత్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, గ్రామీణ విస్తరణ అధికారి రఘురామ్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్తు సమావేశం మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. పారిశుధ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని సూచించారు. వ్యాధుల నివారణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.